RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:105 | ఏప్రిల్ 10, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



మూడు రాష్ట్రాల్లో ప్రశాంతంగా
## ముగిసిన పోలింగ్

2లో



# గ్యాంగ్ రేప్.. మర్డర్?!

## యువతి కిడ్నాప్.. అత్యాచారం.. ఆపై ఉరివేసి హత్య?

- వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఏకే తండాలో దారుణం
- సామూహిక అత్యాచారం చేసి చంపారంటున్న కుటుంబ సభ్యులు
- గంజాయి మత్తులో ఘాతుకం చేశారా?
- రావూరు తండాకు చెందిన యువకులుగా అనుమానం
- పోలీసుల నిర్లక్ష్యంపై బంధువుల ఆగ్రహం.. రోడ్డుపై బైఠాయింపు
- వర్ధన్నపేట మార్చురీ వద్ద ఉద్రిక్తత.. ఖమ్మం హైవేపై రాస్తారోకో
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

2లో

భర్త చేసిన తప్పునకు..
# అంగన్వాడీ టీచర్‌ను చెట్టుకు కట్టేసి..



- దారుణంగా కొట్టిన గ్రామస్తులు
- సంగారెడ్డి జిల్లాలో అమానుష ఘటన
- ఫైనాన్స్ పేరుతో గ్రామస్తుల వద్ద వసూలు చేసినట్లు ఆరోపణలు

2లో

అవయవ దానం..
## ఐదుగురికి ప్రాణదానం



- బ్రెయిన్ హెమరేజ్‌తో మృతి చెందిన ఈవీ సతీష్
- కుటుంబ నిర్ణయం.. సమాజానికి ఆదర్శం

2లో

# ప్రతి బిడ్డకూ విద్యా సౌకర్యాలు కల్పిస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బోనకల్లులో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ
- జూన్ 2 నుంచి అల్పాహార పథకం అమలు
- ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాల విద్యే లక్ష్యం

2లో

## చేరికలతో సందడిగా జాగృతి కార్యాలయం



- యువత, విద్యార్థి నాయకులతో కీలక భేటీలు
- మద్దతుగా తెలంగాణ ఉద్యమకారులు, బంజారా నేతలు
- రేవంత్ సర్కార్‌పై మాటల తూటాలు
- ఇప్పటినుంచే పక్క రాష్ట్ర రాజకీయాలపై నజర్
- కేరళ ఎన్నికల్లో విజయన్‌కు మద్దతు.. కాంగ్రెస్‌పై అటాక్
- కొత్త పార్టీ ఏర్పాటుతో బీఆర్ఎస్ పై ప్రభావం పడనుందా?
- రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తప్పదంటున్న విశ్లేషకులు

2లో

# కవిత రాజకీయం!

కొత్త పార్టీ ఏర్పాటు దిశగా వడివడిగా అడుగులు

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక అంకానికి తెరలేవబోతోంది. జాగృతి అధినేత్రి, కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవిత.. సొంత రాజకీయ అస్తిత్వం కోసం కొత్త పార్టీ దిశగా అడుగులు వేగవంతం చేశారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయం వేదికగా యువత, ఉద్యమకారులు, సామాజిక నేతలను ఏకం చేస్తూ.. అటు రేవంత్ సర్కార్‌పై రాజీలేని పోరాటానికి, ఇటు జాతీయ స్థాయిలో మూడవ కూటమి వ్యూహాలకు ఆమె పదును పెడుతున్నారు. ఈ నెల 25న జరగబోయే పార్టీ ప్రకటన రాష్ట్ర రాజకీయ సమీకరణాల మార్చబోతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గులాబీ కోటలోని అసంతృప్త జ్వాలలు కవిత పార్టీకి ఇంధనంగా మారబోతున్నాయా? బీఆర్ఎస్, కాంగ్రెస్ టార్గెట్ గా కవిత అడుగులు వేయబోతున్నారా? ఇవే విషయాలు ఇప్పుడు స్టేట్ పాలిటిక్స్ చర్చ జరుగుతున్నాయి.

వేద న్యూస్

శుక్రవారం | ఏప్రిల్ 10, 2026

# 'వ్యక్తి ఆరాధన'లో భారత రాజకీయం!

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ కీర్తి గడించింది. అందులో ఎలాంటి అనుమానం లేదు. కానీ, క్రమంగా రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామ్యం కాస్తా వ్యక్తి ఆరాధనగా.. అందులో ఏకోన్ముఖంగా మారిపోయింది. రాజకీయ పార్టీలలో వికేంద్రీకరణ, అంశాల ప్రాతిపదికన చర్చ, సిద్ధాంతాలు,సైద్ధాంతిక భావజాలం కలిగిన కార్యకర్తలు, నేతలు, కేడర్ అంతా కూడా క్రమంగా లీడర్ సెంట్రిక్ పార్టీలో ఇమిడిపోయే తప్పనిసరి పరిస్థితి ఏర్పడంది.

### అంతటా అదే పరిస్థితి..!

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఆర్ఎస్ఎస్ కీలకమైన వెన్నుదన్నుగా ఉంటున్నది. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రమంగా ఆర్ఎస్ఎస్ వంటి సంస్థల కంటే కూడా ఆయనే కీలకమైన కేంద్ర బిందువుగా మారిపోయారు. ఎన్నికల రణరంగంలో విజయం సాధిస్తున్న క్రమంలో మోడీని వివిధ విషయాలపై వివరణ అడిగే పరిస్థితులు లేకపోవచ్చు. దేశంలోనూ బీజేపీకి ముఖచిత్రంగా ప్రధాని నరేంద్ర మోడీని మార్చేశారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ఆయన క్యాంపెయిన్‌కు తప్పనిసరిగా అటెండయి, తనను చూసి ఓటేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. తమ ఎమ్మెల్యే అభ్యర్థులను కాదని జనం ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వాన్ని బలపరచాలనే వాదనను కేడర్ కూడా చేస్తున్నది. అన్ని రాజకీయ పార్టీలలోనూ ఇదే సీన్ ఉంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఆధారంగా ఏర్పడిన




అయితే, ప్రజాస్వామ్యంలో 'వ్యక్తి ఆరాధాన' అంత శ్రేయస్కరమైనది కాదని, దీని వల్ల ప్రజల్లో వ్యవస్థ పట్ల విశ్వాసం ఇక ఉండబోదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. సాధ్యమైనంత వరకు వికేంద్రీకరణ, వ్యవస్థల బలోపేతానికే నాయకులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. తద్వారా మాత్రమే సుపరిపాలనకు అడుగులు పడతాయని చెబుతున్నారు.

టీఆర్ఎస్(బీఆర్ఎస్)లో కేసీఆర్‌ను కాదని ఏమీ చేయలేని పరిస్థితి. ఆయన పరిపాలనను మాత్రమే స్వర్ణయుగంగా అభివర్ణిస్తూ ప్రతీ ఒక్క నాయకుడు మాట్లాడవలసిన అనివార్య పరిస్థితి ఉంటుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీలోనూ 'ఆయనే' లీడర్‌గా ఉంటారు. ఆయన తర్వాత రాజకీయ వారసుడిగా కుమారుడు లోకేశ్ వస్తారేమో,. తెలియదు. ఇక జనసేనాని పవన్ కల్యాణ్ జనసేన పార్టీలో అయితే, ఆయన తప్ప మరో నాయకుడి పేరు అసలెక్కడా అంతగా కనబడదు. ఆయనను చూసే జనం ఓటు వేశారని జనసేన వర్గాలు సైతం చెబుతుంటాయి. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి జాతీయ స్థాయిలో రాహుల్‌గాంధీ నాయకుడిగా ఉన్నా .. రాష్ట్రంలో మాత్రం 'రేవంత్' నాయకత్వాన్నే అనివార్యంగా కేడర్, లీడర్లు బలపరచాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రేవంత్ వర్గంగా లేదా రేవంత్ బలపరిచిన నాయకులకు మాత్రమే శాసనమండలి, రాజ్యసభ సభ్యులుగా, నామినేటెడ్, మంత్రి పదవులు వస్తున్నాయంటే ఢిల్లీ అధిష్ఠానం వద్ద ఆయన పలుకుబడి ఎంత బలంగా ఉందో మాటల్లో చెప్పవలసిన అవసరం లేదు. అయితే, ప్రజాస్వామ్యంలో 'వ్యక్తి ఆరాధాన' అంత శ్రేయస్కరమైనది కాదని, దీని వల్ల ప్రజల్లో వ్యవస్థ పట్ల విశ్వాసం ఇక ఉండబోదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. సాధ్యమైనంత వరకు వికేంద్రీకరణ, వ్యవస్థల బలోపేతానికే నాయకులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. తద్వారా మాత్రమే సుపరిపాలనకు అడుగులు పడతాయని చెబుతున్నారు.



లింగబత్తిని కృష్ణ
సీనియర్ జర్నలిస్ట్
9701923260

భర్త చేసిన తప్పుకు..

# అంగన్వాడీ టీచర్‌ను చెట్టుకు కట్టేసి..

**వేద న్యూస్, సంగారెడ్డి**



సంగారెడ్డి జిల్లాలో మానవత్వాన్ని మరిచిపోయే ఘటన వెలుగులోకి వచ్చింది. భర్త చేసిన తప్పుకు సంబంధం లేకుండా అంగన్వాడీ టీచర్‌పై గ్రామస్తులు దారుణంగా దాడి చేశారు. జిల్లాలోని కంగ్టి మండలం దామరగిద్ద గ్రామానికి చెందిన వసంతకుమారి రాసోల్ గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త ప్రభాకర్ 'హెచ్‌బీఎం ఫైనాన్స్' పేరుతో గ్రామస్తుల వద్ద నుంచి డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భర్తపై ఉన్న ఆగ్రహంతో, అంగన్వాడీ విధులకు వచ్చిన వసంతకుమారిని గ్రామస్తులు జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లి చెట్టుకు కట్టేసి తీవ్రంగా కొట్టారు. అంతేకాకుండా జుట్టు కత్తిరించి గాడిదపై ఊరేగిస్తామని బెదిరింపులకు కూడా దిగారు. తాను ఏ తప్పూ చేయలేదని ఎంత వేడుకున్నా గ్రామస్తులు కనికరం చూపకుండా దాడి కొనసాగించారు. సుమారు గంటకు పైగా ఆమెను చిత్రహింసలకు గురిచేసిన అనంతరం గ్రామ పెద్దలు జోక్యం చేసుకోవడంతో బాధితురాలిని విడిపించారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. తప్పు చేసిన వ్యక్తిని శిక్షించాల్సిన చోట నిర్దోషి మహిళపై దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నారు.

## అవయవ దానం.. ఐదుగురికి ప్రాణదానం

**వేద న్యూస్, హనుమకొండ**

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఈవీ శ్రీనివాస్ రావు సోదరుడు, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు ఈవీ సతీష్ కుమార్ (56) బ్రెయిన్ హెమరేజ్ కారణంగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం బ్రెయిన్ డెడ్ స్థితిలో కన్నుమూశారు. సామాజిక, రాజకీయ రంగాలలో చురుకుగా సేవలందించిన ఆయన ప్రజలకు చేరువైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన మృతి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తీరని లోటుగా మిగిలింది. ఈ క్లిష్ట సమయంలోనూ కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు వచ్చి అవయవ దానం చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం ద్వారా ఐదుగురికి కొత్త జీవితం లభించనుంది. ఈ మహోన్నత చర్యను పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా సతీమణి ఈవీ అనురాధ, కుమారుడు ఈవీ అమయ్ రాణా మాట్లాడుతూ.. ఆయన అవయవ దానం ఇతరులకు జీవం ఇవ్వడం తమకు ఓదార్పునిచ్చిందని తెలిపారు. ఆయన సేవా భావం ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈవీ సతీష్ కుమార్ అంత్యక్రియలు నేడు ఉదయం 11 గంటలకు హనుమకొండ పద్మాక్షమ్మ గుట్టలోని శివముక్తి ధామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

**వేద న్యూస్, నేషనల్ డెస్క్:** అసోం, కేరళ, పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో చెదురుమదురు ఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. కేరళ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 140 స్థానాలకు పోలింగ్ నిర్వహించగా సాయంత్రం 5 గంటల వరకు 75.01 శాతం ఓటింగ్ నమోదైంది. క్యూ లైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ కన్నూరులో ఓటు హక్కు వినియోగించుకోగా, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ, ప్రతిపక్ష నేత వీడీ సతీషన్, రాజీవ్ చంద్రశేఖరన్, నటుడు మోహన్ లాల్ తదితరులు తమ ఓటు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30,495 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 1.46 లక్షల మంది సిబ్బంది విధులు నిర్వర్తించారు. అసోంలో కూడా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 126 నియోజకవర్గాల్లో 722 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. సాయంత్రం 5 గంటల వరకు 84.42 శాతం పోలింగ్ నమోదైంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ గువాహటిలో ఓటు వేయగా, కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ జోర్హాట్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# కవిత రాజకీయం!

- చేరికలతో సందడిగా జాగృతి కార్యాలయం
- యువత, విద్యార్థి నాయకులతో కీలక భేటీలు
- మద్దతుగా తెలంగాణ ఉద్యమకారులు, బంజారా నేతలు
- రేవంత్ సర్కార్ పై మాటల తూటాలు
- ఇప్పటినుంచే పక్క రాష్ట్ర రాజకీయాలపై నజర్
- కేరళ ఎన్నికల్లో విజయన్ కు మద్దతు.. కాంగ్రెస్ పై అటాక్
- కొత్త పార్టీ ఏర్పాటుతో బీఆర్ఎస్ పై ప్రభావం పడనుందా?
- రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తప్పదంటున్న విశ్లేషకులు

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**



కొత్త పార్టీ ఏర్పాటు దిశగా వడివడిగా అడుగులు

కల్వకుంట్ల కవిత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు ఒక్కసారిగా తన దూకుడును పెంచారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయం ఇప్పుడు సరికొత్త రాజకీయ ఉత్తేజంతో కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యువజన సంఘాలు, విద్యార్థి విభాగం నేతలు, తెలంగాణ ఉద్యమకారులు, బంజారా ముఖ్యనేతలు కవితను కలిసి మద్దతు తెలుపుతున్నారు. ఇది కేవలం ఒక పలకరింపు మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఒక భారీ మార్పుకు సంకేతమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నెల 25వ తేదీన ఆమె తన కొత్త పార్టీ పేరును, జెండాను ప్రకటించబోతున్నట్లు ఇప్పటికే కవిత ప్రకటించడం, ఆ దిశగా అడుగులు వేగం పుంజుకోవడంతో పొలిటికల్ హీట్ పెరిగింది.

### రేవంత్ సర్కార్‌పై రాజీలేని పోరాటం

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత పదునైన విమర్శలతో విరుచుకుపడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆమె ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల గొంతుకగా నిలిచేందుకు ఒక బలమైన వేదిక అవసరమని, అందుకే కొత్త పార్టీ స్థాపన అనివార్యమని ఆమె తన అనుచరులతో చెబుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ప్రభుత్వం చేసే ప్రతి తప్పును ఎండగడుతూ, ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషించేందుకు ఆమె సిద్ధమవుతున్నారు.

### జాతీయ స్థాయి ఆకాంక్షలు

కవిత కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా, పొరుగు రాష్ట్రాల రాజకీయాల్లోనూ అప్పుడే తన ప్రభావం చూపే ప్రయత్నం చేస్తున్నారు. కేరళ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ కూటమికి, ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించడం ద్వారా అందరినీ ఆశ్చర్యపరిచారు. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే శక్తులతో కలిసి పనిచేయాలని ఆమె భావిస్తున్నారు. పక్క రాష్ట్ర రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం ద్వారా తన జాతీయ రాజకీయ ఆకాంక్షలను ఆమె స్పష్టం చేశారు. ఇది భవిష్యత్తులో జాతీయ స్థాయిలో ఒక మూడవ కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించేందుకు చేస్తున్న సన్నాహంగా కనిపిస్తోంది.

### బీఆర్ఎస్ అసంతృప్త నేతలతో మంతనాలు

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న అనిశ్చితి, అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులే కవిత ప్రధాన లక్ష్యంగా కనిపిస్తున్నారు. పార్టీలో తగిన గుర్తింపు లభించని నేతలతో ఆమె అంతర్గతంగా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూనే, తనకంటూ ఒక ప్రత్యేక రాజకీయ అస్తిత్వాన్ని నిర్మించుకోవాలని ఆమె గట్టిగా నిశ్చయించుకున్నారు. ముఖ్యంగా తెలంగాణ సెంటిమెంట్‌ను బలంగా నమ్మే వర్గాలను తనవైపు తిప్పుకోవడం ద్వారా బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై గండి కొట్టే వ్యూహంతో ఆమె ముందుకు సాగుతున్నారు.

### తెలంగాణ రాజకీయం మారబోతోందా?

కవిత పెట్టబోయే కొత్త పార్టీ తెలంగాణలో ఏమేరకు ప్రభావం చూపుతుందనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఒకవైపు కాంగ్రెస్ బలోపేతం అవుతుంటే, మరోవైపు బీజేపీ తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. ఇలాంటి తరుణంలో కవిత పార్టీ రంగప్రవేశం చేస్తే, అది బీఆర్ఎస్ పార్టీ మనుగడకే ప్రమాదకరంగా మారుతుందన్న చర్చ నడుస్తోంది. గ్రామీణ స్థాయి నుంచి బలమైన కేడర్ ఉన్న కవిత, యువతను, మహిళలను ఆకర్షించగలిగితే తెలంగాణలో మరో రాజకీయ ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశం ఉంది. ఈ నెల 25న జరిగే అధికారిక ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.



# గ్యాంగ్ రేప్.. మర్డర్?!

- వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఏకే తండాలో దారుణం
- సామూహిక అత్యాచారం చేసి చంపారంటున్న కుటుంబ సభ్యులు
- గంజాయి మత్తులో ఘాతుకం?
- రావూరు తండాకు చెందిన యువకులుగా అనుమానం
- పోలీసుల నిర్లక్ష్యంపై బంధువుల ఆగ్రహం.. రోడ్డుపై బైఠాయింపు
- వర్ధన్నపేట మార్చురీ వద్ద ఉద్రిక్తత.. ఖమ్మం హైవేపై రాస్తారోకో
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు





**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో నాగరిక సమాజం తలదించుకునే ఘటన వెలుగుచూసింది. ఏకే తండాకు చెందిన 21 ఏళ్ల యువతి అనుమానస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పర్వతగిరి రావూరు తండాకు చెందిన నలుగురు యువకులతో కూడిన గంజాయి బ్యాచ్ ఈ దారుణానికి ఒడిగట్టిందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నిందితులు యువతిని కిడ్నాప్ చేసి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ గంజాయి మత్తులో ఆమెను పొలంలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆధారాలు తుడిచిపెట్టేందుకు ఆమెను ఉరివేసి చంపేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సదరు యువతి తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలో కనిపించగా, అప్పటికే ఆమె మృతి చెందింది.

### హైవేపై ఆందోళన.. ఉద్రిక్తత

పోలీసులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బాధితురాలి బంధువులు వర్ధన్నపేట మార్చురీ ముందు ఆందోళనకు దిగారు. ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. తమ బిడ్డను పొట్టనబెట్టుకున్న వారిని కఠినంగా శిక్షించాలని, నిందితులను అరెస్ట్ చేసే వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనివ్వమని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. ఈ ఘటనతో వర్ధన్నపేట మార్చురీ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దారుణానికి ఒడిగట్టిన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మృతికి గల పూర్తి కారణాలు తెలుస్తాయని ఉన్నతాధికారులు వెల్లడించారు. తండాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

## ప్రతి బిడ్డకూ విద్యా సౌకర్యాలు కల్పిస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బోనకల్లులో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ
- జూన్ 2 నుంచి అల్పాహార పథకం అమలు

**వేద న్యూస్, ఖమ్మం**

రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డకు చదువుకోవడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని బోనకల్లు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అక్షరమే అసలైన ఆయుధమని, విద్య ద్వారానే సమానత్వంతో కూడిన ఆదర్శ సమాజం సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ బిడ్డలు విద్యను ఆయుధంగా మలుచుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ బిడ్డ కూడా ఆకలితో బడికి వెళ్లకూడదనే లక్ష్యంతో జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు.

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 10, 2026

# హాట్ సమ్మర్..'కూల్ కూల్' గా..






- జోరందుకున్న కూలర్ల విక్రయాల
- సామాన్యులకు అందుబాటులో రకరకాల కూలర్స్

**వేద న్యూస్, జమ్మికుంట:**

ఏప్రిల్ నెల ప్రారంభమైన నాటి నుంచి భానుడు భగభగల నుంచి ఉపశమనం కోసం జనం కూలర్లను కొనుగోలు చేసేందుకు షాపులకు పరుగు పెడుతున్నారు. తమ బడ్జెట్లో వచ్చే కూలర్లను కొనేందుకు ఆసక్తి చూపుతుండటంతో వ్యాపారులు కూడా వివిధ మోడళ్లలో అందుబాటులోకి తెచ్చారు. తీవ్రమైన వేడి, వడగాలులతో కూడిన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం ప్రజలు తప్పనిసరిగా కూలర్లను కొనుగోలు చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**అందరికీ అనుగుణంగా కూలర్లు అవేలబుల్**

పేద, మధ్యతరగతి వారి ఇండ్లు, గదులకు అనుగుణంగా వివిధ సైజుల్లో కూలర్లు లభ్యమవుతున్నాయి. అయితే, కొందరు తమ పాత కూలర్లకు మరమ్మతులు చేయించుకుంటున్నారు. కాగా, మరికొందరు అయితే, పాతవాటితో కాలం వెల్లదీసే పరిస్థితులు లేవని భావిస్తూ.. సరికొత్త కూలర్లను కొనుగోలు చేస్తూ.. అలా వేసవికాలాన్ని "కూల్ .. కూల్"గా కుటుంబ సభ్యులతో గడిపేందుకు తాపత్రయపడుతున్నారు. మార్కెట్లో ప్రస్తుతం సైజును బట్టి రూ.3 వేల నుంచి రూ. 9వేల వరకు ధరల్లో కూలర్లు లభిస్తున్నాయి. కంపెనీల బ్రాండ్ ను బట్టి కొన్నింటి ధర ఇంకా ఎక్కువగా కూడా ఉంటోంది. ధర ఆధారంగా కూలర్లకు 1, 2 ఏళ్ల వరకు గ్యారంటీ, వారంటీ ఇస్తున్నామని నగరంలోని పలువురు కూలర్ల షాపు యజమానులు చెపుతున్నారు. వేసవి ప్రారంభం నాటికి ఇప్పటికి కూలర్ల ధరలు భారీగా పెరిగాయని వినియోగదారులు చెబుతున్నారు. పలు ప్రముఖ కంపెనీలు కూడా బ్రాండెడ్ పేర్లతో కూలర్లను అందుబాటులోకి తేగా.. అసెంబుల్డ్ కూలర్లు కూడా బాగానే అమ్ముడవు తున్నాయి. ఇవి ప్లాస్టిక్, ఐరన్ బాడీలతో పలు పేర్లతో లభ్యమవుతున్నాయి,

**సరసమైన ధరలకు అందరికీ అందుబాటులో కూలర్లు:డి.రమణ, డీఆర్ ఎలక్ట్రికల్స్, కూలర్ల షాపు యజమాని**

వేసవికాలం ప్రారంభం నుంచే ఎండలతో పాటు కూలర్ల అమ్మకాలకు గిరాకీ పెరిగింది. ఈ ఏడు పట్టణవాసులతో పాటు వివిధ గ్రామాల నుంచి కూలర్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సామాన్యుడికి అందుబాటు ధరల్లో కొత్త కొత్త మోడళ్లు.. అల్యూమినియం, ప్లాస్టిక్ బాడీలతో అందిస్తున్నాం. ఈ ఏడు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో గతం కన్నా ఇంకా ఎక్కువ కూలర్లను విక్రయించే చాన్స్ ఉంది. సామాన్యులకు అందుబాటులో ఉండేలా సరసమైన ధరలకే కూలర్లు అవేలబుల్ గా ఉన్నాయి.

# జనసేవలో ఉప సర్పంచ్..

- 8వ వార్డులో మిషన్ భగీరథ పైప్ లైన్ వర్క్స్
- వేసవి కాలంలో జనానికి ఇబ్బంది కాకుండా..

**వేద న్యూస్ , ఇల్లందకుంట:**



మండల పరిధిలోని టేకుర్తి గ్రామ ఉప సర్పంచ్ కన్నూరి ప్రవీణ్ చిన్న వయసులోనే ప్రజా ప్రతినిధిగా తన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించే దిశగా అడుగులు వేస్తున్నారు. గ్రామంలోని 8 వ వార్డులో జనం సౌకర్యార్థం ప్రస్తుత వేసవికాలం నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా.. మిషన్ భగీరథ పైప్ లైన్ వర్క్స్ దగ్గర ఉండి ప్రవీణ్ చేయించారు. జనం తాగునీటి కి ఇక్కట్లు పడకుండా ఉండేందుకు గాను 'మిషన్ భగీరథ ' ద్వారా నీరు అందించేందుకు పనులు పూర్తి చేశారు. మిషన్ భగీరథ పైపులైను ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ప్రవీణ్ కోరారు. గ్రామ పరిధిలో ప్రజలకు అవసరమయ్యే మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఉపసర్పంచ్ ప్రవీణ్ పేర్కొన్నారు. పాతికేళ్ల వయసులోనే ఉప సర్పంచ్ గా ప్రజల ఆదరాభిమానాలు చూరగొనే విధంగా చక్కగా ప్రజలకు అవసరమయ్యే పనులన్నిటిని.. ఒక్కొక్కటిగా చేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా యువనేతకు పలువురు గ్రామస్తులు సూచించారు. అదే క్రమంలో ప్రజాసేవలో మరింత ముందుకు వెళ్లే విధంగా సదరు యువ లీడర్ ప్రవీణ్ కు ఆశీస్సులు అందిస్తూ.. భవిష్యత్తులో ఈతరం నాయకుడిగా ముందుకు దూసుకు వెళ్లాలని, రాజకీయాల్లో మరింతగా రాణించాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఆందోళన

- తహసీల్దార్ కు గ్రామస్తుల వినతిపత్రం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో వరద కాలువ పక్కన ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో గ్రామస్తులు పేర్కొన్నదేమనగా, ప్రభుత్వం ద్వారా ఇప్పటికే నష్టపరిహారం పొందిన కొందరు రైతులు తిరిగి ఆ భూములను తమవేనని పేర్కొంటూ అక్రమంగా ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం వరి కోతల సమయంలో ప్రభుత్వ భూముల్లో వడ్లు పోయడాన్ని అడ్డుకోవడం వల్ల గ్రామంలో వివాదాలు తలెత్తి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అక్రమంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని గ్రామ ఆస్తిగా ప్రకటించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను కోరారు.

# కార్మిక హక్కుల సాధనకు ఉద్యమించాలి



- 'మేడే' విజయవంతం చేయండి
- సీఐటీయూ నేత గురిజాల శ్రీధర్

**వేద న్యూస్, బోయినిపల్లి:**

ప్రపంచ కార్మిక దినోత్సవం "మే డే" సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజ్‌పల్లి గ్రామంలో హమాలి కార్మికుల ఆధ్వర్యంలో మే 1న జరిగే 140వ మే డే కార్యక్రమానికి సంబంధించి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 140 సంవత్సరాల క్రితం కార్మిక వర్గం వెట్టి చాకిరి నిర్మూలన, కనీస హక్కుల సాధన కోసం చేసిన పోరాటాల ఫలితంగానే నేటి హక్కులు లభించాయని తెలిపారు. ఆ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరుల స్మారకంగా మే 1ను ప్రపంచవ్యాప్తంగా కార్మికుల దినోత్సవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల ద్వారా కార్మిక హక్కులు దెబ్బతింటున్నాయని, 8 గంటల పనిదినం వంటి హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమవుతోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ "మే డే" స్ఫూర్తితో కార్మిక వర్గం హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మే 1న బోయినిపల్లి మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణతో పాటు మే డే కార్యక్రమాలు నిర్వహించనున్నందున, కార్మికులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం నాయకులు సింగిరెడ్డి శంకర్, అనుముల రవి, ఆవుల మల్లయ్య, కొనుకటి రవీందర్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ ఆర్థిక సహాయం

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన కొనపత్రి గజానన్ ఇటీవల అకాలంగా మరణించడం జరిగింది. వారి కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి బాగాలేదని స్థానిక బిజెపి నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బాన్సువాడ నియోజకవర్గం బిజెపి నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ తనవంతు సహాయంగా వారి కుటుంబ సభ్యులకు 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, రుద్రూర్ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, గణేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్ల సేవలు వెలకట్టలేనివి

- డిజిటల్ సాంకేతికతతో సేవలు మరింత పారదర్శకం
- ఎంపీ డా. కడియం కావ్య
- అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ



**వేద న్యూస్, హనుమకొండ:**

మడికొండలోని మా గార్డెన్స్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యకర్తల సేవలు సమాజానికి అమూల్యమైనవని, వారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చిన్నారుల పోషణ, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. స్మార్ట్‌ఫోన్ల ద్వారా ప్రభుత్వ పథకాల అమలు వేగవంతమవుతుందని, సమాచారం లబ్ధిదారులకు సులభంగా చేరుతుందని పేర్కొన్నారు. డిజిటల్ సాంకేతికతతో సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుతాయని చెప్పారు. పిల్లల అభివృద్ధిని పర్యవేక్షించడం, ఆటిజం వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం అంగన్వాడీ టీచర్ల బాధ్యతలో భాగమని వివరించారు. మహిళలు ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్వాడీ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామ్ రెడ్డి, డీడబ్ల్యూఓ విశ్వజ, సీడీపీవోలు, ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఖమ్మం కార్పొరేషన్ కార్యదర్శిగా వలబోయిన వెంకటేశ్వర్లు

**వేదన్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



జిల్లా కాంగ్రెస్ కమిటీ– ఖమ్మం కార్పొరేషన్ కార్యదర్శిగా వలబోయిన వెంకటేశ్వర్లు ను నియమించిన సందర్భంగా తుమ్మల యుగంధర్ కు , డీసీసీ ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. .అత్యంత బాధ్యతాయుతమైన పదవికి తన పేరు సిఫారసు చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పార్టీ నిర్వహించే కార్యక్రమాలను, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలవంటి కార్యక్రమాలను ప్రజాక్షేత్రంలో ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లి, నాకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలియజేస్తూ, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

# హోంవర్క్ సరిగా చేయలేదని..

- విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలు
- జిల్లెల ప్రైవేట్ పాఠశాలలో దారుణం



**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెల గ్రామంలోని విజ్ఞాన్ విద్యానికేతన్ పాఠశాలలో ఉపాధ్యాయురాలు రెండవ తరగతి విద్యార్థినిపై దాడి చేసిన ఘటన కలకలం రేపింది. సోఫియా అనే విద్యార్థిని హోంవర్క్ సరిగా చేయలేదనే కారణంతో ఉపాధ్యాయురాలు కట్టెతో విచక్షణారహితంగా కొట్టినట్లు సమాచారం. ఈ దాడిలో బాలిక శరీరంపై గాయాలు, దద్దులు ఏర్పడినట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పాఠశాలల్లో పునరావృతం అవుతుండటం ఆందోళన కలిగిస్తున్నదని స్థానికులు పేర్కొన్నారు. అలాగే, ఫీజుల విషయంలో కూడా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ ఎండలో నిలబెడుతున్నారని పాఠశాల యాజమాన్యంపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం కాప్రా ప్రెస్ క్లబ్ కృషి అభినందనీయం



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**వేద న్యూస్, కాప్రా :**

జర్నలిస్టుల సంక్షేమం కోసం కాప్రా ప్రెస్ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం కాప్రా ప్రెస్ క్లబ్ లో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీ పరాభవ నామ సంవత్సర తెలుగు క్యాలెండర్ 2026-27 ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజానికి నిష్పక్షపాత సమాచారాన్ని అందించే జర్నలిస్టులు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమం కోసం కాప్రా ప్రెస్ క్లబ్ ముందుకు రావడం చాలా సంతోషమని పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, ఆర్థిక భద్రత, ఆరోగ్య సదుపాయాలు వంటి అంశాలలో కాప్రా ప్రెస్ క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఆయన అభిప్రాయపడ్డారు. మీడియా సమాజానికి నాల్గవ స్థంభంగా నిలుస్తుందని, జర్నలిస్టుల అభివృద్ధి ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విటల్ నాయక్, బిఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు గోగికర్ శివకుమార్, కాంగ్రెస్ నాయకుడు టిల్లు యాదవ్, బిజెపి డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్య రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు వెంకటాచలం, సంపత్ రావు, కె. ఉమా శ్రీధర్, సోమేష్ నాయుడు, రాజు యాదవ్, మురళీ దేవ్ గౌడ్, కాప్రా ప్రెస్ క్లబ్ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి, ఉపాధ్యక్షులు యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్ రావు, గార్లపాటి శ్రీనివాస్ రావు, గోవిందుకుంట్ల ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణ, మాజీ కోశాధికారి యాటరాజు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు

- ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తప్పవు
- ఎస్సై రాహుల్ రెడ్డి హెచ్చరిక



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండలంలోని రైతులకు పోలీసులు కీలక సూచనలు చేశారు. రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టడం వల్ల ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులకు అవి కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే చర్యలను నివారించాలని హెచ్చరించారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగితే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె. రాహుల్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు కోరారు.

# జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- ఏప్రిల్ 23, 24న హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సభలు



**వేద న్యూస్, భూపాలపల్లి:**

"ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు నాల్గవ స్థంభంగా కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి ఐక్యతే వారి శక్తి. హక్కుల సాధనకు అందరూ ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉంది" అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియా జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ఏప్రిల్ 23, 24 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి మహాసభలు జర్నలిస్టుల సమస్యలు, సవాళ్లు, భవిష్యత్ దిశపై చర్చించే కీలక వేదికగా నిలుస్తాయని అన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఒకేచోట చేరి తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా వృత్తి అభివృద్ధికి దోహదం కలుగుతుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణకు ఇలాంటి సమావేశాలు మార్గదర్శకంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ మరియు భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ పావుశెట్టి శ్రీనివాస్ ,జిల్లా అధ్యక్షులు ఎడ్ల. సంతోష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ్మటి రవీందర్, గట్టు. రవీందర్, కడపక. రవి కారుకూరి సతీష్, వెంకటేశ్వర్లు, మారుపెల్లి చంద్రమౌళి రాచర్ల సుధాకర్, ప్రజా ప్రతినిధు తదితరులు పాల్గొన్నారు.

# అత్యాచారం కేసులో ఆకుతోట శిరీష్ కు పదేళ్ల జైలు శిక్ష

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**



వరంగల్ నగరం మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన అత్యాచారం కేసులో స్థానిక కార్పొరేటర్ భర్తకు న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష ఖరారు చేసింది. ఓ యువతిని మోసం చేసి అత్యాచారానికి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో వరంగల్ ఎల్లంబజార్ కు చెందిన ప్రధాన నిందితుడు ఆకుతోట శిరీష్ కు పదేళ్ల జైలు శిక్షతో పాటు యాభై ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ వరంగల్ ఒకటో అదనపు సెషన్స్ న్యాయమూర్తి ప్రేమలత తీర్పు వెలువరించారు. ఇదే వ్యవహారంలో నిందితుడికి సహకరించిన అతని తండ్రి ఆకుతోట సుధాకర్ కు వెయ్యి రూపాయల జరిమానా విధించారు.

# ఘనంగా శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి కళ్యాణం





**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో నిర్వహిస్తున్న మూడు రోజుల జాతర సందర్భంగా శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్, పాలకవర్గం, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తుల కోసం తాగునీరు, అన్నప్రసాదం వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ వెంకట్, శైలజ దంపతులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. మూడు రోజుల పాటు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు యజ్ఞాలు, హోమాలు నిర్వహించి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. రెండవ రోజు స్వామివారి పల్లకి ఉత్సవం నిర్వహించి, పెద్ద చెరువులో తెప్పోత్సవం జరిపారు. మూడవ రోజు వేదమంత్రాల మధ్య మంగళసూత్రధారణతో కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణ ఘట్టాన్ని తిలకించిన భక్తులు భక్తి పరవశంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుమ్మల జయ, వార్డు సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్

**వేద న్యూస్, పోతంగల్ :**



సీసీ రోడ్డు నిర్మాణ పనులను హంగర్గ సర్పంచ్ ఉదయ్ భాస్కర్ స్థానిక నాయకులతో కలసి బీసీ కాలనీలో గురువారం ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ 10 లక్షల నిధులతో ఈ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగాధర్, కార్యదర్శి గంగారాం, ఉప సర్పంచ్ గోపి, బజరంగ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు స్వయం ఉపాధే లక్ష్యం

**వేద న్యూస్, చొప్పదండి:**

- ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి
- యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్



దివ్యాంగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ కృషి చేస్తోందని సంస్థ తెలంగాణ అసిస్టెంట్ మేనేజర్ మాగాని రాజమౌళి తెలిపారు. గన్నేరువరం మండల కేంద్రంలోని శిక్షణ కేంద్రంలో రెండు నెలల పాటు శిక్షణ పొందిన దివ్యాంగులకు కుట్టు యంత్రాలు, జిరాక్స్ మెషిన్లు, వెజిటేబుల్ కిట్లు, ఎలక్ట్రీషియన్ సామగ్రి, టిఫిన్ సెంటర్ గ్రైండర్లు, ప్లంబింగ్ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లాలోని ఎనిమిది మండలాల్లో దివ్యాంగులకు శిక్షణతో పాటు అవసరమైన పరికరాలను అందిస్తున్నామని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యమన్నారు. శిక్షణ అనంతరం వ్యాపారానికి అవసరమైన కిట్లు అందించడం వల్ల దివ్యాంగులు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. కిట్లు పొందిన వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీలు రాజు, కృష్ణ, మండల కోఆర్డినేటర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితురాలికి ఆర్థిక సాయం చేసి భరోసానిచ్చిన స్నేహితులు

**వేద న్యూస్, హన్మకొండ :**



ఇటీవల దురదృష్టవశాత్తు ఎర్ర రాణి భర్త ఎర్ర రాజు మృతి చెందగా ఎర్ర రాణి 2008-2009 పదవ తరగతి పూర్వ విద్యార్థులు గురువారం వారి కుటుంబ సభ్యుల్ని కలిసి రూ.10వేల ఆర్థిక సహాయం అందించి మనోధైర్యాన్ని కల్పించారు. పరామర్శించిన వారిలో పలివేల్పులకి చెందిన జై భీమ్ యూత్ ఆర్గనైజర్ అలువాల భానుప్రకాశ్, శ్రావణ్ కుమార్, సుధీర్, పవెందర్, రాజేష్, నవీన్, అనిల్, రాధిక, దీపిక, రమ్య తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 10, 2026

# హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**- సమ్మేళన సమితి అధ్యక్షుడు కండికొండ మోహన్**

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

రంగశాయిపేట, శంభునిపేట బస్తీ ఆధ్వర్యంలో మహంకాళి దేవాలయ ప్రాంగణంలో ఈనెల 14న మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు కందికొండ మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం రంగశాయిపేట మహంకాళి దేవాలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళనం కరపత్రాలను, పోస్టర్ లను, డోర్ స్టిక్కర్లను హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు, ఉమ్మడి వరంగల్ జిల్లా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ్ అధ్యక్షులు చిలుకమారి సంజీవ్ జీ పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మం, హిందూ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు చాటి చెబుతూ, సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు హిందూ సమ్మేళనాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందువుల ఐక్యతే జాతీయ సమైక్యతకు నిదర్శనం అన్నారు. మన భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలపాలనే లక్ష్యంతో ఆర్ఎస్ఎస్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సమ్మేళనానికి



ముఖ్య అతిథులుగా అధ్యాత్మిక గురువులు శ్రీ స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, ముఖ్య వక్తగా అఖిలభారత వనవాసి కళ్యాణ పరిషత్ మార్గదర్శి పొన్నపల్లి వెంకట రామ సోమయాజులు, మహిళా వక్తగా విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు బోయినపల్లి రాధ పాల్గొంటున్నట్లు తెలిపారు. రంగశాయిపేట, శంభునిపేట బస్తీ ఆధ్వర్యంలో నిర్వహించే హిందూ సమ్మేళనానికి ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా భారీ ఎత్తున తరలి రావాలనికోరారు. ఈ కార్యక్రమంలో శంభునిపేట, రంగశాయిపేట ప్రాంతం కాలనీ ముఖ్యులు, స్థానికులు, ఉత్సవ సమితి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర్లపల్లికి తీవ్ర సమస్యగా ఇసుక మాఫియా

**- 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్**

**వేద న్యూస్, జమ్మికుంట:**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం వెంకటేశ్వర్ల పల్లి లో గత మూడు నెలలుగా కొనసాగుతున్న ఇసుక రవాణా గ్రామ ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీస్తోందని వెంకటేశ్వర్లపల్లి 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్ తెలిపారు.(పాత కొరపల్లి గ్రామపంచాయతీ) వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసిన తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని పేర్కొన్నారు. చెక్‌పోస్ట్ కారణంగా ఇసుక మాఫియా కార్యకలాపాలు గ్రామంలోని అంతర్గత వీధుల వైపు మళ్లి, రోజుకు కనీసం 300కు పైగా ట్రాక్టర్లు అధిక వేగంతో రాకపోకలు సాగిస్తున్నాయని వివరించారు. దీంతో గ్రామంలోని రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయనీ, దుమ్ము, శబ్ద కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ చెప్పారు. ప్రత్యేకంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, మహిళలు రోడ్లపై నడవడం కూడా ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారనీ తెలిపారు.ఎప్పుడు ఏ ట్రాక్టర్ వేగంగా వస్తుందో తెలియని పరిస్థితిలో ప్రమాద భయం నెలకొందనీ ,గతంలో చిన్నపాటి ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారుల నుండి తగిన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారనీ చెప్పారు.

# జనగణన-2027పై అవగాహన సమావేశం

**- ఎన్యుమరేషన్ బ్లాక్‌లను స్పష్టంగా గుర్తించాలి - తహసీల్దార్ వరప్రసాద్**

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



జనగణన-2027 ప్రక్రియలో భాగంగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ అధికారితో పాటు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ వరప్రసాద్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్యుమరేషన్ బ్లాక్‌లను మ్యాప్‌పై స్పష్టంగా గుర్తించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో బ్లాక్‌ల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, మ్యాప్‌లలో ప్రారంభ స్థానాలను (వాడ పేరు/యజమాని పేరు) కూడా నమోదు చేసినట్లు తెలిపారు. జనగణన ప్రక్రియను ఖచ్చితంగా, తప్పులు లేకుండా నిర్వహించేందుకు సిబ్బంది పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ పాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు

# రోడ్లపై పంటలు ఆరబెట్టొద్దు

**- వాహనాలు జారిపడే ప్రమాదం**
**- సురక్షిత ప్రదేశాల్లోనే ఆరబెట్టాలి**
**- రైతులకు పోలీసులు హెచ్చరిక**

**వేద న్యూస్, శాయంపేట:**



రోడ్లపై పంటలు ఆరబెట్టడం వల్ల వాహనాలు జారిపడే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరించారు. రైతులు సురక్షితమైన ప్రదేశాల్లోనే పంటలను ఆరబెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ మాట్లాడుతూ.. మండలంలోని కొన్ని గ్రామాల్లో రైతులు పంటలను రహదారులపై ఆరబెడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో, అధిక వేగంతో ప్రయాణించే వాహనాలకు ఈ పరిస్థితి మరింత ప్రమాదకరమవుతుందని పేర్కొన్నారు. రోడ్లపై పంటలు ఉండడం వల్ల వాహనాలు జారిపడటం, డ్రైవర్లు నియంత్రణ కోల్పోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. అందువల్ల రైతులు తమ పంటలను రహదారులపై కాకుండా సురక్షిత ప్రదేశాల్లో ఆరబెట్టాలని సూచించారు. రోడ్లపై పంటలు వేయడం వల్ల ప్రమాదాలు జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులకు సహకరించాలని కోరారు.

# పేద కుటుంబాకు ఆసరా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్



**- ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
**- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**
**- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

**వేద న్యూస్, మడికొండ:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మడికొండ గ్రామంలోని మా ఫంక్షన్ హాల్‌లో గురువారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలు ఆర్థిక భారంగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలు పేద, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆడబిడ్డల భవిష్యత్తుకు బలమైన ఆధారంగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు తమ పిల్లల వివాహాలను గౌరవప్రదంగా నిర్వహించుకోవాలని సూచించారు. అర్హులైన వారందరికీ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా కొనసాగిస్తూ ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# వెంకటాపూర్ సమీపంలో ట్రాక్టర్ బోల్తా

**- యువకుడు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు**

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం, గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన మనోజ్ (ట్రాక్టర్ యజమాని ఎల్లారెడ్డి కుమారుడు) డ్రైవర్ నితిన్‌తో కలిసి ట్రాక్టర్ సర్వీసింగ్ కోసం సిరిసిల్లకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో వెంకటాపూర్ శివారులో ట్రాక్టర్ నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడి మనోజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ నితిన్ తీవ్రంగా గాయపడగా సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో నాగంపేట గ్రామంలో విషాదం నెలకొంది.

# ఇందిర మహిళా శక్తి భవన నిర్మాణం వేగవంతం చేయాలి

**వేద న్యూస్ గద్వాల :**

గద్వాల శివారులో రూ.5.7 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఇందిర మహిళా శక్తి భవనం పనులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ భవనం ప్రారంభమైన తర్వాత మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించేందుకు ఇది కేంద్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళల సాధికారతకు ఈ భవనం కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. భవనంలో నిర్మిస్తున్న డార్మెటరీ హాల్స్, ఓపెన్ డైనింగ్, కిచెన్ తదితర గదులను పరిశీలించి పనుల నాణ్యతపై సూచనలు ఇచ్చారు. ప్రతి నిర్మాణ దశలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణం, ఫర్నిచర్ మరియు ఇతర సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవనం పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా అన్ని సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని



కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, గుత్తేదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఈ భవనం కీలక మైలురాయిగా నిలవనుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# 'దీన్ దయాళ్ మహా అభియాన్' ముగింపు

**- బీజేపీ నాయకుల పాల్గొనికతో శిక్షణ కార్యక్రమం పూర్తి**



**వేద న్యూస్, మడికొండ:**

మడికొండలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్-2026 శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. 44, 45, 46, 64 డివిజన్లలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కన్వీనర్ బన్న ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ప్రశిక్షణ అభియాన్ వరంగల్ జిల్లా ఇంచార్జ్ చాడ శ్రీనివాస్ రెడ్డి, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ చరిత్ర, వికాసం గురించి వివరించారు. 1951లో జనసంఘ్‌గా ప్రారంభమై 1980లో భారతీయ జనతా పార్టీగా ఏర్పడి, ప్రస్తుతం దేశంలో అతిపెద్ద జాతీయ పార్టీగా ఎదిగిందని తెలిపారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఈ మహాభియాన్ దోహదపడుతుందని అన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, శ్యామ ప్రసాద్ ముఖర్జీ, అటల్ బిహారీ వాజపేయి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్, జిల్లా నాయకులు పొనగోటి వెంకట్ రావు, గడ్డం మహేందర్, నాయిని కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జలవిహార్ పేలుడు విషాదం.. చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

**వేద న్యూస్ హైదరాబాద్ :**



హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో బుధవారం మధ్యాహ్నం సంభవించిన భారీ పేలుళ్ల ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లేక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జలవిహార్ ఆర్వో ప్లాంట్‌లో బుధవారం భారీ పేలుళ్లు జరిగిన విషయం పాఠకులకు విదితమే. అయితే ఈ ఘటనలో ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మణ్(50) తీవ్ర గాయాలు అవ్వడంతో అతని పోలీసులు సోమాజిగూడలోని జాయ్ హాస్పిటల్‌కు తరలించారు.అతను చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరిలో అంజి(25) ప్రాథమిక చికిత్స పొంది హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ కాగా మరో వ్యక్తి అప్పలనాయడు(45) గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్నట్టు లేక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వీరు ముగ్గురు జలవిహార్‌లోని క్వార్టర్స్‌లో ఉంటూ అక్కడే కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. మృతి చెందిన లక్ష్మణ్ మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

## కర్బూజ గింజలతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు



**వేద న్యూస్ డెస్క్:**

వేసవి కాలంలో లభించే కర్బూజ పండు రుచికే కాదు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. అయితే చాలా మంది పండును తిని దాని గింజలను పారేస్తుంటారు. వాస్తవానికి కర్బూజ గింజల్లో శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు మరియు ఖనిజాలు పుష్కలంగా ఉంటాయని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు. వీటిని ఎండబెట్టి తీసుకుంటే మెదడు చురుగ్గా పనిచేయడమే కాకుండా శరీరానికి అవసరమైన తక్షణ శక్తి లభిస్తుంది. ఈ మధ్య కాలంలో వీటిపై పెరుగుతున్న అవగాహనతో మార్కెట్లో కూడా వీటికి విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఈ గింజల్లో లభించే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె జబ్బులు రాకుండా కాపాడతాయి. అలాగే రక్తపోటును నియంత్రించడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే పొటాషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. గుండె కండరాలను బలోపేతం చేయడంలో మరియు ఒత్తిడిని తగ్గించడంలో ఈ గింజలు సహజ సిద్ధమైన మందుగా పనిచేస్తాయని పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కర్బూజ గింజలు ఎంతగానో ఉపయోగపడతాయి. వీటిలో ఉండే విటమిన్ సి తెల్ల రక్తకణాల ఉత్పత్తిని పెంచి ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తిని శరీరానికి అందిస్తుంది. అలాగే కంటి చూపును మెరుగుపరచడానికి అవసరమైన విటమిన్ ఏ కూడా ఇందులో సమృద్ధిగా ఉంటుంది. తరచూ జలుబు, దగ్గు వంటి సమస్యలతో బాధపడే వారు తమ ఆహారంలో వీటిని చేర్చుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ముఖ్యంగా శీతాకాలం మరియు వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నుండి ఇవి రక్షణ కల్పిస్తాయి. జీర్ణక్రియను మెరుగు పరచడంలో మరియు మలబద్ధకం సమస్యను వదిలించుకోవడంలో కర్బూజ గింజలు దోహదపడతాయి.

## ఫ్రిజ్ నీటి వినియోగంపై పెరుగుతున్న ఆందోళనలు

**వేద న్యూస్ డెస్క్:**



ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలు దాహాన్ని తీర్చుకోవడానికి ఫ్రిజ్ లోని చల్లని నీటిని తాగేందుకు అత్యంత ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. బయట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్న తరుణంలో ఇంటికి రాగానే ఐస్ లాంటి చల్లటి నీరు తాగడం వల్ల ఉపశమనం లభిస్తుందని అందరూ భావిస్తున్నారు. అయితే ఇలా అతిగా చల్లని నీటిని తీసుకోవడం వల్ల శరీరానికి కలిగే ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉందని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ అలవాటు వల్ల తక్షణమే ఉపశమనం లభించినప్పటికీ దీర్ఘకాలంలో పలు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా ఫ్రిజ్ నీరు తాగడం వల్ల జీర్ణక్రియపై తీవ్ర ప్రభావం పడుతోంది. అతిగా చల్లబరిచిన నీరు తాగినప్పుడు రక్త నాళాలు కుంచించుకుపోయి జీర్ణ ప్రక్రియ నెమ్మదిస్తుంది. మనం తీసుకున్న ఆహారం సరిగ్గా అరగకపోవడంతో పాటు కడుపులో అసౌకర్యం మరియు మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తుతాయి. శరీర ఉష్ణోగ్రత సాధారణంగా 37 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉంటుంది. అయితే మనం హఠాత్తుగా తక్కువ ఉష్ణోగ్రత ఉన్న నీటిని తాగినప్పుడు ఆ నీటిని శరీరం మళ్ళీ సాధారణ ఉష్ణోగ్రతకు తీసుకురావడానికి అధిక శక్తిని ఖర్చు చేయాల్సి వస్తుంది. దీనివల్ల జీర్ణక్రియకు అందాల్సిన శక్తి తగ్గిపోయి శరీరం త్వరగా అలసటకు గురవుతుందని వైద్యులు వివరిస్తున్నారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలు కూడా చల్లని నీటితో ముడిపడి ఉన్నాయి. ఫ్రిజ్ నీరు తాగడం వల్ల గొంతులోని శ్లేష్మ పొర దెబ్బతిని గొంతు నొప్పి, దగ్గు మరియు జలుబు వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ఎండలో తిరిగి వచ్చిన వెంటనే ఐస్ నీరు తాగడం వల్ల గొంతు ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం అధికంగా ఉంటుంది. అలాగే ఫ్రిజ్ నీరు తాగడం వల్ల గుండె వేగం తగ్గే ప్రమాదం కూడా ఉందని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. అతిగా చల్లబరిచిన పానీయాలు తాగినప్పుడు మెదడులోని నరాలపై ప్రభావం పడి మైగ్రేన్ లేదా తలనొప్పి వచ్చే అవకాశం కూడా ఉంటుంది. అందుకే శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు చల్లని నీటికి దూరంగా ఉండటం ఎంతో శ్రేయస్కరం. కేవలం ఆరోగ్యపరంగానే కాకుండా దంతాల పైన కూడా ఫ్రిజ్ నీటి ప్రభావం ఉంటుంది. అతిగా చల్లబరిచిన నీటిని తాగడం వల్ల దంతాల ఎనామెల్ దెబ్బతిని దంతాలు సెన్సిటివిటీకి గురవుతాయి. దీనివల్ల ఆహారం తీసుకునేటప్పుడు పళ్ళు జివ్వుమనడం లేదా నొప్పి రావడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు మరియు వృద్ధులు ఫ్రిజ్ నీరు తాగే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. చాలా మంది బరువు తగ్గాలని భావించే వారు కూడా చల్లని నీరు తాగితే కొవ్వు కరుగుతుందని అనుకుంటారు కానీ అది వాస్తవం కాదు. వాస్తవానికి చల్లని నీరు తాగడం వల్ల శరీరంలో కొవ్వు గడ్డకట్టి బరువు తగ్గడం మరింత కష్టమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందడానికి ఫ్రిజ్ నీటికి ప్రత్యామ్నాయంగా మట్టి కుండలో భద్రపరిచిన నీటిని తాగడం అత్యంత ఉత్తమమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మట్టి కుండ నీరు సహజ సిద్ధంగా చల్లబడటమే కాకుండా నీటిలోని మలినాలను శుద్ధి చేసి ఆరోగ్యానికి మేలు చేసే ఖనిజాలను అందిస్తుంది. ఒకవేళ ఫ్రిజ్ లోని నీటిని తాగాల్సి వస్తే నేరుగా తాగకుండా అందులో సాధారణ నీటిని కలుపుకుని తాగడం వల్ల ప్రమాదం తగ్గుతుంది. వేసవిలో శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవడానికి కొబ్బరి నీళ్లు, మజ్జిగ మరియు పండ్ల రసాలను ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరుతున్నారు. సరైన జాగ్రత్తలు పాటించడం ద్వారా మాత్రమే వేసవిలో అనారోగ్య బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

## రక్తహీనత, ఎముకల బలహీనతకు చెక్ పెట్టే పోషకాలు



**వేద న్యూస్ డెస్క్:**

ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి మరియు ఆహారపు అలవాట్ల వల్ల చాలా మంది రక్తహీనత మరియు ఎముకల బలహీనత వంటి సమస్యలతో బాధపడుతున్నారు. శరీరానికి కావాల్సిన అతి ముఖ్యమైన ఖనిజాలలో ఐరన్ (ఇనుము) మరియు కాల్షియం అత్యంత కీలకమైనవి. ఐరన్ లోపం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గి త్వరగా అలసట, నీరసం ఆవహిస్తాయి. మరోవైపు, కాల్షియం లోపిస్తే ఎముకలు గుల్లబారి చిన్న దెబ్బలకే విరిగే ప్రమాదం ఉంటుంది. ఈ రెండు పోషకాలు సమపాళ్ళలో అందినప్పుడే మనిషి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటాడని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్తహీనతను నివారించడంలో ఐరన్ పాత్ర వెలకట్టలేనిది. ఊపిరితిత్తుల నుండి శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేసే ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి ఐరన్ ఎంతో అవసరం. ఐరన్ తక్కువైతే ఏకాగ్రత తగ్గడం, జుట్టు రాలడం మరియు చర్మం పాలిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా మహిళలు మరియు చిన్నపిల్లల్లో ఈ సమస్య అధికంగా కనిపిస్తోంది. దీనిని అధిగమించడానికి తోటకూర, పాలకూర వంటి ఆకుకూరలు, బెల్లం, వేరుశనగలు మరియు ఎండు ద్రాక్ష వంటి పదార్థాలను రోజూ తీసుకోవాలి. విటమిన్ సి అధికంగా ఉండే నిమ్మరసం వంటివి ఐరన్ గ్రహణ శక్తిని పెంచుతాయి. ఎముకలు మరియు దంతాల పటిష్టతకు కాల్షియం అత్యంత ఆవశ్యకం. వయసు పెరిగే కొద్దీ ఎముకల్లో సాంద్రత తగ్గి 'ఆస్టియోపోరోసిస్' వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కాల్షియం కేవలం ఎముకలకే కాకుండా గుండె లయను క్రమబద్ధీకరించడానికి మరియు నరాల పనితీరుకు కూడా తోడ్పడుతుంది. పాలు, పెరుగు, పనీర్ వంటి డైరీ ఉత్పత్తులతో పాటు రాగులు, నువ్వులు మరియు బాదం పప్పులలో కాల్షియం పుష్కలంగా లభిస్తుంది. శరీరానికి కాల్షియం సరిగ్గా అందాలంటే విటమిన్ డి కూడా అవసరమని, అందుకోసం ప్రతిరోజూ కాసేపు సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## పీఎఫ్‌లో తేదీ తప్పితే నష్టం

**వేద న్యూస్ డెస్క్:**




ఉద్యోగుల భవిష్యత్ నిధి సంస్థ తాజాగా పీఎఫ్ ఖాతాదారులకు కీలక హెచ్చరిక జారీ చేసింది. ఉద్యోగం మారే సమయంలో పీఎఫ్ ఖాతాలో నమోదు అయ్యే జాయినింగ్ తేదీ, ఎగ్జిట్ తేదీలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో పెన్షన్, డబ్బుల ఉపసంహరణలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్పష్టం చేసింది. చిన్న పొరపాటు కూడా పెద్ద నష్టానికి దారి తీస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉద్యోగులు ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు మారేటప్పుడు పీఎఫ్ ఖాతాలో నమోదు అయ్యే సేవా కాలం పూర్తిగా ఈ తేదీలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ జాయినింగ్ లేదా ఎగ్జిట్ తేదీల్లో తప్పులు ఉంటే పీఎఫ్ క్లెయిమ్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అంతేకాకుండా పీఎఫ్ మొత్తాన్ని మరో ఖాతాకు బదిలీ చేయడంలో ఆలస్యం జరుగుతుంది. సేవా కాలం తప్పుగా నమోదైతే రిటైర్మెంట్ సమయంలో లభించే పెన్షన్ కూడా తగ్గిపోవచ్చు. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. పీఎఫ్ ఖాతాదారులు ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను సరిచేసుకునే సౌకర్యం అందుబాటులో ఉందని చెప్పారు. అధికారిక పోర్టల్‌లో లాగిన్ అయి ఎగ్జిట్ తేదీని సరిచేసుకోవచ్చు. జాయినింగ్, ఎగ్జిట్ వివరాలు పీఎఫ్ కాంట్రిబ్యూషన్ రికార్డులతో సరిపోతే సిస్టమ్ స్వయంచాలకంగా ఆమోదం ఇస్తుంది. కొన్ని సందర్భాల్లో పాత సంస్థ మూసివేయబడినా లేదా యజమాని స్పందించకపోయినా సమస్యకు పరిష్కారం ఉందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో జాయింట్ డిక్లరేషన్ ఫారమ్ నింపి సంబంధిత కార్యాలయాన్ని సంప్రదిస్తే అధికారులు రికార్డులను పరిశీలించి అవసరమైన మార్పులు చేస్తారని వివరించారు. భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండాలంటే ప్రతి ఉద్యోగి తన యూఏఎన్ ఖాతాలోకి వెళ్లి వివరాలను ఒకసారి తనిఖీ చేసుకోవాలని సూచిస్తున్నారు. చిన్న తప్పు కూడా పెద్ద నష్టానికి దారి తీసే అవకాశం ఉన్నందున ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని నిపుణులు చెబుతున్నారు.

## విమాన టిక్కెట్లకు ఊరట

**వేద న్యూస్ డెస్క్:**



పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో జెట్ ఇంధన ధరలు భారీగా పెరగడంతో విమాన టిక్కెట్ల ధరలు పెరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ ప్రయాణికులకు కొంత ఉప శమనం కల్పించేందుకు విమానయాన సంస్థలపై పడుతున్న భారం తగ్గించే దిశగా చర్యలు చేపట్టింది. దేశంలోని ప్రధానం కాని విమానాశ్రయాలలో ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను 25 శాతం మేర తగ్గిస్తూ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వచ్చి వచ్చే మూడు నెలల పాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ రాయితీ వల్ల విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులు తగ్గి, ప్రయాణికులపై పడే భారం కొంత మేర తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే విధంగా ప్రధాన విమానాశ్రయాల్లో కూడా ఇలాంటి రాయితీలను అమలు చేసే అంశాన్ని సంబంధిత నియంత్రణ సంస్థ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ చర్యల ద్వారా విమానయాన రంగానికి సుమారు వందల కోట్ల రూపాయల మేర ఆర్థిక ఉపశమనం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో జెట్ ఇంధన ధరలు దాదాపు రెట్టింపు కావడంతో విమానయాన సంస్థలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇంధన ధరల పెరుగుదల కారణంగా ఇప్పటికే విమానయాన సంస్థలు అదనపు ఛార్జీలు విధించాల్సి వచ్చిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విమాన టిక్కెట్ల ధరలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషించనుంది. పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైతే ఈ రాయితీలను మరింత కాలం పొడిగించే అవకాశముందని అధికారులు సంకేతాలు ఇచ్చారు. మొత్తంగా చూస్తే, అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో పెరిగిన విమాన ప్రయాణ ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు సాధారణ ప్రయాణికులకు కొంత ఊరటనిస్తాయని భావిస్తున్నారు.

## హ్యుందయ్ కార్ల ధరల పెంపు

**వేద న్యూస్ డెస్క్:**




ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యుందయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే మే 1 నుంచి తన పోర్టు ఫోలియోలోని అన్ని కార్ల ధరలను 1 శాతం వరకు పెంచ నున్నట్లు ప్రకటిం చింది. ఇన్‌పుట్ వ్యయాలు గణనీయంగా పెరగడం వల్ల కంపెనీపై ఆర్థిక భారం అధికమైందని, దాన్ని కొంతవరకు వినియోగదారులకు బదిలీ చేయాల్సిన అవసరం ఏర్పడిందని సంస్థ వెల్లడించింది. ఉత్పత్తి ఖర్చులు, ముడి సరుకుల ధరలు, రవాణా వ్యయాలు పెరగడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. ఈ ధరల పెంపు మే 1 నుంచి అమల్లోకి రానుండగా, వివిధ మోడళ్లపై పెరుగుదల శాతం స్వల్పంగా మారవచ్చని కంపెనీ తెలిపింది. దీంతో కొత్త కార్లు కొనాలనుకునే వినియోగదారులు ముందుగానే కొనుగోలు చేయాలని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి.

## తక్కువ ధరకే కాలింగ్ ప్లాన్‌లు

**వేద న్యూస్ డెస్క్:**




టెలికాం రీఛార్జ్ ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్య వినియోగదారులకు ట్రాయ్ శుభవార్త అందించింది. డేటా అవసరం లేని వారికి కేవలం కాల్స్, ఎస్ఎంఎస్ సౌకర్యాలు మాత్రమే కలిగిన తక్కువ ధర ప్లాన్‌లను తీసుకురావాలని టెలికాం సంస్థలకు సూచించింది. ప్రస్తుతం ఎక్కువగా అందుబాటులో ఉన్న రీఛార్జ్ ప్లాన్‌లు డేటాతో కలిపి ఉండటం వల్ల ఇంటర్నెట్ వినియోగం చేయని వినియోగదారులు కూడా అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ట్రాయ్ కొత్త మార్గదర్శకాలను సిద్ధం చేసింది. ప్రతి టెలికాం సంస్థ కనీసం ఒక వాయిస్ కాల్, ఎస్ఎంఎస్ ప్లాన్‌ను తప్పనిసరిగా అందించాలని స్పష్టం చేసింది. డేటా లేకుండా ఉండే ఈ ప్లాన్‌ల ధరలు సాధారణ ప్లాన్‌ల కంటే తక్కువగా ఉండాలని సూచించింది. అలాగే ఈ ప్లాన్‌లు కేవలం దీర్ఘకాల వాలిడిటీతోనే కాకుండా, తక్కువ రోజుల వాలిడిటీతో కూడా అందుబాటులో ఉండేలా చేయాలని ఆదేశించింది. దీంతో వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా ప్లాన్‌ను ఎంచుకునే అవకాశం పొందుతారు. గతంలో కూడా ఇలాంటి ఆదేశాలు వచ్చినప్పటికీ కొన్ని సంస్థలు ధరలను తగ్గించకుండా పెద్దగా ప్రయోజనం కలిగించలేకపోయాయి. అయితే ఈసారి తీసుకొచ్చిన సవరణలతో వినియోగదారులకు నిజమైన లాభం చేకూరే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, వృద్ధులు వంటి డేటా వినియోగం తక్కువగా ఉన్న వారికి ఈ నిర్ణయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ మార్పులతో టెలికాం రంగంలో పారదర్శకత పెరగడంతో పాటు కంపెనీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ కూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఈ నిర్ణయం వినియోగదారులకు తక్కువ ఖర్చుతో మెరుగైన సేవలను అందించే దిశగా కీలకంగా మారనుంది

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 10, 2026

# మూడు నెలలే బతుకుతావన్నా.. యువరాజ్ అద్భుత పోరాటం

**వేద న్యూస్ డెస్క్:**



భారత క్రికెట్ చరిత్రలో తనదైన ముద్ర వేసుకున్న మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ జీవితంలో క్యాన్సర్‌తో చేసిన పోరాటం ఇప్పటికీ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఒక దశలో తాను మరో మూడు నుంచి ఆరు నెలలకు మించి బతకలేనని వైద్యులు చెప్పినా, క్రికెట్‌పై ఉన్న అపారమైన ప్రేమ, గెలవాలనే పట్టుదలతో ఆ పరిస్థితిని అధిగమించానని యువరాజ్ తాజాగా వెల్లడించాడు. తన కెరీర్‌లో అత్యంత కఠినమైన ఆ రోజులను గుర్తు చేసుకుంటూ అనేక భావోద్వేగ విషయాలను పంచుకున్నాడు. రెండువేల పదకొండులో భారతదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో యువరాజ్ సింగ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. జట్టును విజయంలోకి నడిపించిన అతను, అనేక కీలక మ్యాచ్‌లలో ఒత్తిడిని తట్టుకుని విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే ఆ టోర్నీ సమయంలోనే అతడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మ్యాచ్‌ల సమయంలో నొప్పిని భరిస్తూ, కొన్నిసార్లు రక్తం వాంతి చేసినప్పటికీ జట్టు కోసం పోరాడిన యువరాజ్ నిజమైన యోధుడిగా నిలిచాడు. ప్రపంచకప్ ముగిసిన తర్వాత విదేశీ పర్యటనలకు సిద్ధమవుతున్న సమయంలో తన ఆరోగ్య సమస్యలు మరింత పెరిగాయని యువరాజ్ తెలిపాడు. టెస్టు జట్టులో చోటు దక్కబోతున్న ఆనందం మధ్యలోనే తనకు క్యాన్సర్ ఉన్నట్టు తెలిసి తీవ్ర షాక్‌కు గురయ్యానని చెప్పాడు. కెరీర్ అత్యుత్తమ దశలో ఉండగా ఒక్కసారిగా జీవితం చీకట్లోకి వెళ్లిపోయినట్టుగా అనిపించిందని పేర్కొన్నాడు. తరువాత వైద్యులను సంప్రదించగా ఊపిరితిత్తులు మరియు గుండె మధ్య భాగంలో కణతి ఉన్నట్టు నిర్ధారణ అయిందని యువరాజ్ వెల్లడించాడు. ఈ పరిస్థితిలో వెంటనే చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం తప్పదని, కీమోథెరపీ చేయించుకోకపోతే మూడు నుంచి ఆరు నెలలకంటే ఎక్కువ బతకలేవని వైద్యులు స్పష్టంగా చెప్పారని తెలిపాడు.

ఆ మాటలు విన్నప్పుడు తనకు ఏమి చేయాలో అర్థం కాలేదని, అయినప్పటికీ క్రికెట్ ఆడాలనే ఆలోచన మాత్రమే తన మనసులో తిరుగుతూనే ఉండేదని చెప్పాడు. అయితే పరిస్థితులు మరింత దిగజారడంతో విదేశాలకు వెళ్లి చికిత్స తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అక్కడ వైద్యులు తనకు ధైర్యం చెప్పి సరైన చికిత్స అందించడంతో తనలో మళ్లీ ఆశలు పుట్టాయని యువరాజ్ పేర్కొన్నాడు. కీమోథెరపీ సమయంలో శారీరకంగా బలహీనపడినా, మానసికంగా మాత్రం తాను కుంగిపోలేదని తెలిపాడు. క్రికెట్ తనకు ప్రాణం లాంటిదని, ఆ ఆటే తనను ముందుకు నడిపించిందని అన్నాడు. చికిత్స సమయంలో కూడా క్రికెట్ మ్యాచ్‌ల వీడియోలు చూస్తూ, మైదానంలో తిరిగి అడుగుపెట్టాలనే లక్ష్యంతో తన మనోధైర్యాన్ని నిలబెట్టుకున్నాడు. ఆ సమయంలో తన సహచర ఆటగాళ్లు, ముఖ్యంగా సీనియర్ క్రికెటర్లు వచ్చి ధైర్యం చెప్పడం తనకు ఎంతో బలాన్నిచ్చిందని గుర్తుచేసుకున్నాడు. కుటుంబ సభ్యుల మద్దతు కూడా తనకు ఆ కష్టకాలంలో అండగా నిలిచిందని చెప్పాడు. క్రమంగా ఆరోగ్యం మెరుగుపడడంతో యువరాజ్ మళ్లీ ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాడు. విదేశాల్లో కొంతకాలం కఠినంగా శ్రమించి తన శరీరాన్ని తిరిగి సిద్ధం చేసుకున్నాడు. ఆ తర్వాత మైదానంలోకి తిరిగి వచ్చి మళ్లీ తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొని తిరిగి అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అరుదైన విషయం అని క్రీడా నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. యువరాజ్ సింగ్ జీవితం కేవలం ఒక క్రికెటర్ కథ మాత్రమే కాదు, కష్టాలను ఎదుర్కొని నిలబడే మనోబలానికి ప్రతీకగా నిలిచింది. ప్రాణాపాయం ఎదురైనా వెనక్కి తగ్గకుండా పోరాడితే విజయం సాధించవచ్చని అతని జీవితం చెబుతోంది. ప్రస్తుతం యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేస్తూ తన అనుభవాన్ని పంచుకుంటున్న యువరాజ్, జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా ధైర్యంగా ఎదుర్కోవాలని యువతకు సందేశం ఇస్తున్నాడు.

# ఐపీఎల్‌లో కొత్త రికార్డు సృష్టించిన శుభ్‌మన్ గిల్



**వేద న్యూస్ డెస్క్:**

గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించాడు. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గిల్, గుజరాత్ తరపున 2500 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ మైలురాయిని చేరుకోవడానికి గిల్‌కు కేవలం 12 పరుగులు అవసరమయ్యాయి. ఆ విజయాన్ని 7వ ఓవర్ ఐదో బంతికి ఫోర్ కొట్టడం ద్వారా సాధించాడు. 2022లో గుజరాత్ జట్టులో చేరిన శుభ్‌మన్ గిల్, నిరంతర రాణనతో జట్టుకు కీలక బ్యాటర్‌గా మారాడు. ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు అదరగొట్టారు. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు సాధించి, జోస్ బట్లర్ 52 పరుగులతో మరియు వాషింగ్టన్ సుందర్ 55 పరుగులతో జట్టు స్కోరును 200 దాటించడంలో కీలక పాత్ర పోషించారు. గిల్ 70 పరుగులతో రాణించడం జట్టు విజయానికి బలమైన ఆడగాడిగా మారినట్టే, ఇప్పుడు 211 పరుగుల లక్ష్యంతో ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్ ప్రారంభించింది. అభిమానులు, క్రీడా వర్గాలు ఈ అరుదైన రికార్డు ఘనతను గౌరవిస్తూ, గిల్ తదుపరి ప్రదర్శనను ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# క్వార్టర్ ఫైనల్లో ఆయుశ్..

## తొలి రౌండ్‌లోనే సింధు, ప్రణయ్ ఇంటికి..!



**వేద న్యూస్ డెస్క్:**

భారత యువ షట్లర్ అయుష్ శెట్టి బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో అద్భుత ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. చైనా తైపీ ఆటగాడు చీ యు జెన్‌ను 21-16, 21-12తో ఓడించి, మొదటి సారి పెద్ద మైదానంలో తన ఆధిపత్యాన్ని చాటాడు. ఈ టోర్నీలో సీనియర్లు విఫలమయ్యారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌హెచ్ ప్రణయ్, మొదటి రౌండ్‌లోనే చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యాంగ్ చేతిలో పరాజయపొందగా, మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు కూడా మొదటి రౌండ్‌లోనే బయటయ్యారు. సీనియర్ల విఫలత మధ్య, 20 ఏళ్ల యువ కుర్రాడు అయుష్ భారత్‌కు సానుకూల ఫలితాన్ని అందించాడు. ఇప్పటివరకు ఏకైక యువ కుర్రాడిగా ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఎదుగుతున్న అయుష్, తొలి రౌండ్‌లో 7వ ర్యాంకర్ చైనా ఆటగాడిని ఓడించిన తర్వాత, క్వార్టర్స్‌లో 25వ ర్యాంకర్ చీ యు జెన్‌ను సులభంగా చిత్తు చేశాడు. ఇప్పుడు క్వార్టర్స్‌లో అతడికి ఎదురుగా ఇండోనేషియా ఆటగాడు జోనాథన్ క్రిస్టీ ఉండనున్నాడు. సెమీస్‌కు చేరేందుకు అయుష్ అతని వ్యూహాలను జయించాల్సి ఉంది. ఈ విజయంతో 20 ఏళ్ల యువ షట్లర్ ఆసియా మైదానంలో భారత క్రీడా ప్రతిభను మరింతగా చాటాడు. అభిమానులు, క్రీడా వర్గాలు ఇప్పుడు అయుష్ యొక్క సెమీస్ మరియు ఫైనల్ ప్రదర్శనపై గాఢంగా కూర్చున్నాయి. తన ఆట ప్రదర్శనతో యువ కుర్రాడు ఇప్పటికే టోర్నీ యొక్క స్టార్‌గా ఎదుగుతున్నాడు. తొలి రెండు రౌండ్లలోనే సీనియర్లు విఫలమయ్యడం, యువతరం ప్రత్యర్థులపై ప్రభావాన్ని చూపించడం, భారత షట్లింగ్ భవిష్యత్తుకు కొత్త ఊతాన్ని ఇచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బాబర్ ఆజం విరాట్‌తో పోలికపై సీరియస్

**వేద న్యూస్ డెస్క్:**



పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 సీజన్‌లో పెషావర్ జల్మీ కెప్టెన్ బాబర్ ఆజం తనదైన శైలిలో అసహనాన్ని వ్యక్తం చేశారు. బుధవారం కరాచీ వేదికగా హైదరాబాద్ కింగ్స్‌మెన్‌పై విజయం సాధించిన అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో, టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రస్తావన రావడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఒక రిపోర్టర్ బాబర్ ఫినిషింగ్ సామర్థ్యంపై విమర్శిస్తూ "విరాట్ కోహ్లీ తన జట్టును ఒంటిచేత్తో గెలిపించినట్లుగా మీరు ఎందుకు చేయలేకపోతున్నారు?" అని అడగగా, బాబర్ ఆజం ఘాటుగా సమాధానం ఇచ్చారు. "మీరు ఏ ఉద్దేశంతో ఈ ప్రశ్న అడుగుతున్నారో నాకు అర్థమవుతోంది. ఆ చర్చను ఇక్కడితో ఆపేయండి" అని చెప్పి రిపోర్టర్ నోరు మూయించారు. తన కెరీర్‌లో ఎన్నో మ్యాచ్‌లను విజయవంతంగా ముగించానని, గణాంకాలు చూస్తే ఆ విషయం స్పష్టమవుతుందని బాబర్ తెలిపారు. బాబర్ సమాధానంపై నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయారు. ఆయన అభిమానులు, గెలిచిన మ్యాచ్‌లో ఇలాంటి ప్రతికూల ప్రశ్నలు అడగడం సరికాదని వాదిస్తున్నా, విరాట్ కోహ్లీ అభిమానులు మరియు క్రికెట్ విశ్లేషకులు.. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే బాబర్ ఫినిషింగ్ సామర్థ్యం, స్ట్రైక్ రేట్‌ను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

# ఐపీఎల్‌లో కొత్త నిబంధనలు అమలు

**వేద న్యూస్ డెస్క్:**



ఐపీఎల్ 2026 సీజన్‌లో క్రికెట్ నియంత్రణ సంస్థ కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. ముఖ్యంగా బెంచ్‌పై ఉండే ఆటగాళ్ల ప్రవర్తనపై కట్టుదిట్టమైన నియంత్రణలు విధించబడుతున్నాయి. మ్యాచ్ సమయంలో అవసరం లేని కదలికల వల్ల సమయం వృథా అవుతుందనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కొత్త నిబంధనల ప్రకారం మ్యాచ్ జరుగుతున్న సమయంలో బెంచ్‌పై ఉన్న ఆటగాళ్లు స్టేడియం చుట్టూ స్వేచ్ఛగా తిరగరాదు. జట్టు యాజమాన్యం ఇచ్చిన 16 మంది ఆటగాళ్ల జాబితాలో లేని వారు ఎవరూ మైదానంలోకి ప్రవేశించకూడదు. అలాగే సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు పదేపదే డ్రింక్స్, బ్యాట్లు, గ్లోవ్స్ లేదా డగౌట్ నుంచి సందేశాలు తీసుకురావడాన్ని నిషేధించారు. డ్రింక్స్ ఇవ్వడంపై కూడా స్పష్టమైన నియమాలు విధించారు. కేవలం వికెట్ పడినప్పుడు లేదా బౌండరీ వద్ద మాత్రమే ఆటగాళ్లకు పానీయాలు అందించాలి. అంపైర్ల అనుమతి లేకుండా మైదానంలోకి ఎలాంటి పానీయాలు తీసుకురావడం అనుమతించబడదు. ఇంకా, మైదానంలోకి వచ్చే ప్రతి ఆటగాడు తప్పనిసరిగా క్రికెట్ దుస్తులు ధరించి ఉండాలి. సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌లుగా లేని ఆటగాళ్లు బౌండరీ, కంచె మధ్య ప్రాంతంలో ఉన్నప్పుడు టీమ్ ట్రైనింగ్ బిబ్స్ ధరించడం తప్పనిసరి చేశారు. ఈ మార్పులతో మ్యాచ్‌ల నిర్వహణ మరింత క్రమబద్ధంగా సాగడంతో పాటు సమయపాలన మెరుగుపడుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

# బంగ్లాదేశ్-భారత్ క్రికెట్ సంబంధాలు పునరుద్ధరణకు తమీమ్ ప్రయత్నాలు


**వేద న్యూస్ డెస్క్:**




బంగ్లాదేశ్‌లో రాజకీయ మార్పుల వెంటనే క్రికెట్ బోర్డులో కూడా విప్లవాత్మక మార్పులు చోటుచేసు కున్నాయి. కొత్త ప్రధానమంత్రిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత, బోర్డును స్థిరంగా చలింపజేయడం కోసం మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్‌ను బాధ్యులుగా నియమించారు. బోర్డులో నెలకొన్న అస్థిరతను తొలగించడానికి 11 మంది సభ్యులతో కూడిన అడ్-హాక్ కమిటీని ఏర్పాటు చేసి, అధ్యక్షుడిగా తమీమ్ బాధ్యతలు చేపట్టారు. రాబోయే 90 రోజులలో పారదర్శక ఎన్నికలు నిర్వహించి, బోర్డును నూతన యాజమాన్యం వద్దకు హస్తాంతర పరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అతి ఇటీవల జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 సమయంలో భారత్ పర్యటనకు నిరాకరించడం వల్ల బంగ్లాదేశ్-భారత్ క్రికెట్ సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ అసహజ పరిస్థితిని సరిచేసేందుకు తమీమ్ చర్యలు ప్రారంభించారు. ఈ ఏడాది చివర్లో ద్వైపాక్షిక సిరీస్ కోసం టీమిండియాను బంగ్లాదేశ్‌కు ఆహ్వానిస్తూ, బీసీసీఐకి అధికారిక ప్రతిపాదనలు పంపించారు. తమీమ్ భావించనేది ఏమిటంటే, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా భారత్ పర్యటన విజయవంతం అవడం ద్వారా రెండు దేశాల మధ్య క్రికెట్ బంధాన్ని మరింత బలోపేతం చేయవచ్చు.


# డేవిడ్ మిల్లర్ మైదానంలోనే ఏడ్చేశాడు

**వేద న్యూస్ డెస్క్:**



ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో బుధవారం రాత్రి జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ స్టార్ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ మైదానంలోనే కన్నీరు పెట్టడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. డెల్టీ మ్యాచ్‌లో మిల్లర్ చేసిన ఒక చిన్న పొరపాటు కారణంగా అతను తీవ్ర ఆవేదన చెందాడు. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్ చివరి బంతి వరకు ఉత్కంఠ కొనసాగింది. గుజరాత్ టైటాన్స్ ఒక్క పరుగు తేడాతో గెలిచింది. చివరి 2 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన సమయంలో మిల్లర్ స్వయంగా మ్యాచ్ ఫినిష్ చేయాలనుకుని పరుగు తీయకుండా నిర్ణయం తీసుకున్నాడు. కానీ చివరి బంతిని కనెక్ట్ చేయలేకపోయి రన్ కోసం ప్రయత్నంలో కుల్దీప్ యాదవ్ రనౌట్ అయ్యాడు. ఫలితంగా ఢిల్లీ ఒక్క పరుగుతో ఓడిపోయింది. ఐపీఎల్ ఆఫీసియల్ ఎక్స్ హ్యాండిల్‌లో విడుదలైన వీడియోలో మిల్లర్ భావోద్వేగంలో మునిగినట్లుగా, కోచ్ హేమంగ్ బదానీ అతన్ని ఓదార్చుతూ కనిపించారు. ఈ ఓటమితో టైటాన్స్ తమ మూడో మ్యాచ్‌లో పాయింట్ల ఖాతాను తెరిచినప్పటికీ, ఢిల్లీ విజయాన్ని చేజార్చుకుని నిరాశలో మునిగింది.

# ‘రాకా’ టైటిల్‌పై ఆసక్తి




**వేద న్యూస్ డెస్క్:**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం ‘రాకా’పై సినీ వర్గాల్లో చర్చలు జోరందుకున్నాయి. ప్రముఖ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం అల్లు అర్జున్ కెరీర్‌లో ఇరవై రెండవ చిత్రంగా నిలవడం విశేషం. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచి అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ‘రాకా’ అనే పదానికి సాధారణంగా అసలు స్వరూపం, క్రూరత్వం, బలమైన శక్తి అనే భావాలు ఉన్నట్లు చెప్పబడుతోంది. ఈ నేపథ్యంలో సినిమాలో హీరో పాత్ర చాలా శక్తివంతంగా, కఠినంగా ఉండే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. టైటిల్ ద్వారానే కథలోని ప్రధాన పాత్ర స్వభావాన్ని సూచించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ పూర్తిగా భిన్నమైన రూపంలో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. గుండు తల, నెరిసిన గడ్డం, నుదిటిపై గాయాలు, కళ్లలో ఆగ్రహం కలగలిపి అతడిని యుద్ధంలో గాయపడిన యోధుడిలా చూపిస్తున్నాయి. తోడేలు ఆకారాన్ని సూచించే దృశ్య అంశం కథపై మరింత ఉత్కంఠను పెంచుతోంది. ఇది ఒక శక్తివంతమైన స్వభావాన్ని ప్రతిబింబిస్తోందని భావిస్తున్నారు. కథలో మనిషి నుంచి వేరే రూపంలోకి మారే అంశం ఉండొచ్చని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గతంలో కొన్ని చిత్రాల్లో కనిపించిన ప్రయోగాత్మక పాత్రల మాదిరిగా ఇందులో కూడా కొత్త తరహా పాత్రను చూపించే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా చూస్తే ‘రాకా’ అనే టైటిల్ చుట్టూ ఇప్పటికే ఆసక్తికరమైన చర్చ ప్రారంభమైంది. అల్లు అర్జున్ కొత్త లుక్, దర్శకుడి శైలి, భారీ స్థాయిలో రూపొందుతున్న నిర్మాణం కలిపి ఈ సినిమాను మరింత ప్రత్యేకంగా నిలబెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ టైటిల్ వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటో తెలుసుకోవాలంటే సినిమా విడుదల వరకు ఎదురుచూడాల్సిందే.

# సోషల్ మీడియాను షేక్ చేస్తున్న శృతి హాసన్



**వేద న్యూస్ డెస్క్:**

పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సంపాదించిన అందాల నటి శృతి హాసన్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తన అందం, నటన, గాన ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఇండస్ట్రీలో ప్రత్యేకమైన స్థానం సంపాదించిన ఆమె, ప్రస్తుతం సోషల్ మీడియాలో తన యాక్టివిటీతో అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. ప్రతి రోజు కొత్త ఫోటోలు, వీడియోలు, వ్యక్తిగత భావాలను పంచుకుంటూ ట్రెండింగ్‌లో నిలుస్తోంది. సింగర్‌గా తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన శృతి హాసన్, తరువాత హీరోయిన్‌గా మారి తక్కువ కాలంలోనే స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. చిన్నప్పటి నుంచే సంగీతంపై ఆసక్తి పెంచుకున్న ఆమె, గానరంగంలో తన ప్రతిభను నిరూపించుకుంది. ఆ తర్వాత నటిగా మారి తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తమిళ చిత్రంతో తెరపైకి వచ్చిన ఆమె, తెలుగులో ‘అనగనగా ఓ ధీరుడు’ చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తరువాత ‘ఓ మై ఫ్రెండ్’ చిత్రం చేసినప్పటికీ పెద్దగా విజయం సాధించలేదు. అయితే పవన్ కళ్యాణ్‌తో కలిసి చేసిన ‘గబ్బర్ సింగ్’ చిత్రం ఆమె కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ విజయం సాధించడంతో శృతి హాసన్‌కు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కాయి. ఒక్కసారిగా ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదిగి, నిర్మాతల మొదటి ఎంపికగా మారింది. దీని తరువాత ‘బలుపు’, ‘రామయ్య వస్తావయ్యా’, ‘ఎవడు’, ‘రేసుగుర్రం’, ‘ఆగడు’, ‘శ్రీమంతుడు’ వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకుంది. కమర్షియల్ సినిమాల్లోనూ, కంటెంట్ ఆధారిత చిత్రాల్లోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. మాస్, క్లాస్ అన్న తేడా లేకుండా అన్ని రకాల పాత్రల్లో సులభంగా ఒదిగిపోయే నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఇక తరువాత కాలంలో ‘కాటమరాయుడు’, ‘క్రాక్’, ‘వకీల్ సాబ్’, ‘వీరసింహారెడ్డి’, ‘వాల్తేరు వీరయ్య’, ‘హాయ్ నాన్న’, ‘సలార్’ వంటి చిత్రాలతో తన కెరీర్‌ను మరింత బలపరిచింది. ముఖ్యంగా పెద్ద స్టార్ హీరోలతో కలిసి నటించడం ద్వారా ఆమె మార్కెట్ మరింత పెరిగింది. ప్రతి సినిమాలో తన పాత్రకు తగిన విధంగా మారుతూ, కొత్తదనాన్ని చూపించడం ఆమె ప్రత్యేకతగా మారింది. ప్రస్తుతం శృతి హాసన్ తమిళ చిత్రాలతో బిజీగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉంటుంది. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు, వర్కౌట్ వీడియోలు, మ్యూజిక్ సెషన్స్, ఫ్యాషన్ ఫోటోషూట్స్ వంటి విషయాలను అభిమానులతో పంచుకుంటూ ఎప్పుడూ ట్రెండ్‌లో ఉంటుంది. ముఖ్యంగా తన ఓపెన్ అభిప్రాయాలు, స్ట్రైట్ ఫార్వర్డ్ నేచర్ వల్ల ఆమెకు ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పడింది. అదేవిధంగా, తన వ్యక్తిగత జీవితంపై కూడా నిజాయితీగా స్పందిస్తూ అభిమానులతో దగ్గరగా ఉంటుంది. సినిమా మాత్రమే కాకుండా సంగీతం, ఫ్యాషన్, లైఫ్ స్టైల్ వంటి విభాగాల్లో కూడా తన ముద్ర వేస్తోంది. అందుకే ఆమెను కేవలం హీరోయిన్‌గా కాకుండా ఒక పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా అభిమానులు భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, శృతి హాసన్ తన ప్రతిభతో, కష్టంతో, విభిన్న రంగాల్లో రాణిస్తూ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నటిగా, గాయనిగా, సోషల్ మీడియా సెలబ్రిటీగా ఆమె ప్రయాణం నిరంతరం ముందుకు సాగుతుండగా, అభిమానుల్లో ఆమె క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు.

# బాబీపవన్ భేటీపై ఆసక్తి



**వేద న్యూస్ డెస్క్:**

దర్శకుడు బాబీ తాజాగా నటుడు పవన్ కల్యాణ్‌ను కలిసిన విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, ఈ ఇద్దరూ మళ్లీ కలిసి సినిమా చేయబోతున్నారా అనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే తాజా సమాచారం ప్రకారం, ఈ సమావేశం వెనుక సినిమా ప్రాజెక్ట్ కంటే వేరే కారణం ఉన్నట్లు తెలుస్తోంది. నటుడు చిరంజీవితో బాబీ రూపొందించనున్న కొత్త చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమానికి పవన్ కల్యాణ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించేందుకు ఈ భేటీ జరిగినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే బాబీ పవన్‌ను ప్రత్యక్షంగా కలిసి ఆహ్వానం అందించినట్లు సమాచారం. ఇటీవల బాబీ దర్శకత్వంలో వచ్చిన చిత్రంతో చిరంజీవి మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు పవన్ కల్యాణ్ ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అయినప్పటికీ సినీ రంగానికి సంబంధించిన ముఖ్య కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఆయన ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బాబీపవన్ భేటీపై వచ్చిన సందేహాలకు ఇప్పుడు స్పష్టత వచ్చినట్లైంది. మొత్తంగా చూస్తే, ఈ భేటీ కొత్త సినిమా కోసం కాకుండా, చిరంజీవిబాబీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కార్యక్రమం కోసమే జరిగినట్లు తెలుస్తోంది. అయితే భవిష్యత్తులో ఈ కాంబినేషన్‌లో సినిమా వచ్చే అవకాశాలపై కూడా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పర్సంటేజ్ విధానంపై వివాదం

**వేద న్యూస్ డెస్క్:**




తెలంగాణలో థియేటర్ రంగంలో మరోసారి వివాదం చెలరేగింది. థియేటర్ యజమానులు మరియు నిర్మాతల మధ్య పర్సంటేజ్ విధానం అమలుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ విధానం ప్రకారం సినిమా టికెట్ వసూళ్లలో ఒక నిర్దిష్ట శాతాన్ని నిర్మాతలు, థియేటర్ యజమానులు పంచుకోవాలి. ప్రస్తుతం అమలులో ఉన్న అద్దె లేదా స్థిర చెల్లింపు విధానంతో పోలిస్తే ఈ పద్ధతి భిన్నంగా ఉంటుంది. థియేటర్ యజమానుల అభిప్రాయం ప్రకారం ఈ విధానం అమలు చేస్తే ఆదాయం కొంత స్థిరంగా ఉండే అవకాశముందని చెబుతున్నారు. ముఖ్యంగా సినిమాల ప్రదర్శనలో వచ్చే హెచ్చుతగ్గులను దృష్టిలో ఉంచుకుంటే ఇది అనుకూలంగా ఉంటుందని వారు భావిస్తున్నారు. అయితే నిర్మాతల సంఘం మాత్రం ఈ విధానానికి వ్యతిరేకంగా నిలుస్తోంది. ఈ పద్ధతి వల్ల తమకు వచ్చే లాభాలు తగ్గే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా భారీ వ్యయంతో రూపొందే సినిమాల విషయంలో ఇది అనుకూలంగా ఉండదని అభిప్రాయపడుతున్నారు. ఈ విభేదాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో పరిశ్రమలో అనిశ్చితి నెలకొంది. త్వరలో విడుదలకు సిద్ధంగా ఉన్న డెకాయిట్, లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ వంటి సినిమాలపై ఈ వివాదం ప్రభావం చూపే అవకాశముంది. పరిస్థితులు చక్కబడకపోతే విడుదల తేదీలు మారే అవకాశం ఉండటంతో పాటు కొన్ని సినిమాలు వాయిదా పడే పరిస్థితి కూడా కనిపిస్తోంది. ఈ వివాదం కారణంగా ప్రేక్షకుల్లో కూడా అయోమయం నెలకొంది. సినిమాల విడుదలపై స్పష్టత లేకపోవడంతో ఆసక్తి ఉన్న వారిలో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఈ పరిస్థితి సినీ రంగంపై ప్రతికూల ప్రభావం చూపే సూచనలు కనిపిస్తున్నాయి. పరిశ్రమలో నెలకొన్న ఈ సమస్యకు త్వరగా పరిష్కారం కనుగొనకపోతే దీర్ఘకాలంలో సినిమా వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పరస్పర చర్చల ద్వారా మధ్యస్థ మార్గాన్ని కనుగొనాల్సిన అవసరం ఉందని సినీ వర్గాలు సూచిస్తున్నాయి.

# రేణు దేశాయ్‌పై అసభ్య కామెంట్..



**వేద న్యూస్ డెస్క్:**

నటి రేణు దేశాయ్‌పై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల తనపై జరుగుతున్న ఆన్‌లైన్ వేధింపులపై రేణు దేశాయ్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు తీసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో గుంటూరుకు చెందిన చెన్నయ్య రుంజాల అనే వ్యక్తి తన యూట్యూబ్ ఖాతా ద్వారా రేణు దేశాయ్ పోస్టుపై అభ్యంతరకర వ్యాఖ్య చేసినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సైబరాబాద్ పోలీసులు గుంటూరుకు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో అతడు తన ఫోన్ నుంచే ఆ కామెంట్ పెట్టినట్లు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. రేణు దేశాయ్ ఈ నెల ప్రారంభంలోనే తనపై జరుగుతున్న ఆన్‌లైన్ వేధింపులపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వ్యక్తిగత జీవితంలోకి చొరబడుతూ అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. గతంలో కూడా ఇలాంటి వేధింపులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు హెచ్చరించారు. అసభ్యకర, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సైబర్ నేరాలకు సంబంధించి సమస్యలు ఎదురైతే వెంటనే హెల్ప్‌లైన్ లేదా సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

# పెద్ది స్పెషల్ సాంగ్‌లో ఎవరు..? మృణాల్ లేదా మానస..



**వేద న్యూస్ డెస్క్:**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘పెద్ది’ మరోసారి వార్తల్లో నిలిచింది. దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇప్పుడు ఈ చిత్రంలోని స్పెషల్ సాంగ్‌లో ఎవరు కనిపించబోతున్నారు అనే అంశం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మొదట ఈ పాట కోసం బాలీవుడ్ నటి మృణాల్ ఠాగూర్ పేరు వినిపించగా, తాజాగా మానస వారణాసి పేరు కూడా ముందుకు రావడంతో ఆసక్తి మరింత పెరిగింది. సినిమాలోని స్పెషల్ సాంగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా, థియేటర్లలో హైలైట్ అయ్యేలా ఈ పాటను రూపొందించాలని చిత్రబృందం భావిస్తోంది. అందుకే ఈ పాటలో కనిపించే నటి ఎంపిక విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మృణాల్ ఠాగూర్ ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలతో మంచి గుర్తింపు సంపాదించుకుని ప్రేక్షకులకు చేరువైంది. ఆమె ఈ పాటలో కనిపిస్తే సినిమాకు మరింత క్రేజ్ పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇక మానస వారణాసి విషయానికి వస్తే, మిస్ ఇండియా టైటిల్ గెలుచుకుని సినీ రంగంలో అడుగుపెట్టిన ఆమె తక్కువ సమయంలోనే యూత్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. గ్లామర్‌తో పాటు స్క్రీన్ ప్రెజెన్స్ ఉన్న నటిగా పేరుపొందిన మానస ఈ పాటలో కనిపిస్తే కొత్త ఆకర్షణ తీసుకురావచ్చని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ ఇద్దరిలో చివరకు ఎవరు ఎంపిక అవుతారు అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటివరకు చిత్రబృందం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఈ స్పెషల్ సాంగ్ చుట్టూ సస్పెన్స్ కొనసాగుతోంది. త్వరలోనే ఈ అంశంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు ‘పెద్ది’ సినిమా విడుదల తేదీపై కూడా ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. మొదట మార్చి చివరిలో విడుదల చేయాలని భావించిన ఈ చిత్రాన్ని తర్వాత ఏప్రిల్ చివరికి వాయిదా వేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆ తేదీపై కూడా స్పష్టత రాకపోవడంతో మరోసారి వాయిదా పడే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మొత్తానికి స్పెషల్ సాంగ్ ఎంపిక, విడుదల తేదీపై నెలకొన్న అనిశ్చితి కారణంగా ‘పెద్ది’ చిత్రం మరింత చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే చిత్రబృందం అధికారిక ప్రకటన చేస్తుందా అన్నది ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిగా మారింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073